PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

DK MEDIA
approved by Govt of INDIA, TELANGANA
OUR SERVICES
* NEWS PAPER * NEWS CHANNEL * DK GRAPHICS
* DK ADS & PROMOTIONS * DK PRINTERS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 01 సంచిక : 335 ఆదివారం, జూన్ 28 2026 , పేజీలు - 5 వెల : 5 రూ/-

### గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం

## సన్నద్ధం కావాలి




**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27**
గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయం చేసుకోవాలి..జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

### మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం

## ఇళ్లు ఇవ్వాలి

- మూసీ రివర్ ఫ్రంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఆదేశం
- భూసేకరణ ఆసక్తి ఉన్నవాళ్లకు టీడీఆర్ ఇవ్వాలి




**హైదరాబాద్ :**మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న వారికి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు కింద డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు కోసం భూమిలిచ్చేందుకు ముందుకు వచ్చే వారికి టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్ మెంట్ రైట్స్) లేదా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని సూచించారు. మూసీ తొలి దశ అభివృద్ధిపై మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి : గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ నుంచి తీసుకుంటున్న భూముల్లో ఉన్న నిర్మాణాల్ని రాష్ట్ర ప్రభుత్వమే తరలించేలా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు లక్ష్యాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో రూపురేఖలను ప్రజలకు వివరించేవిధంగా నెక్లెస్‌రోడ్డులో 'మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడే మూసీ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల్ని స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఉన్నతాధికారులు నర్సింహారెడ్డి, గౌతమి, సర్ఫరాజ్ అహ్మద్, మాణిక్‌రాజ్ పాల్గొన్నారు. భూముల బదలాయింపు ప్రక్రియే కీలకం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవన ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో మరో కీలక ముందగుడు పడిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలోని బాపుఘాట్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్' కోసం 83 ఎకరాల భూములివ్వడానికి రక్షణశాఖ ఇటీవలే అంగీకరించింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపు ప్రక్రియకు ఓకే చెప్పింది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత ఆర్మీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలు రాయి అని ఆయన అభివర్ణించారు. పచ్చజెండా ఊపిన రక్షణశాఖ ఆ సమయంలోనే ప్రభుత్వం అడిగిన 83.814 ఎకరాలకు ఇవ్వడానికి రక్షణశాఖ పచ్చజెండాను ఊపింది.

### కేవలం 'బటన్' నొక్కితే

## సరిపోదు




**అమరావతి:**జనసేన పార్టీ ఆవిర్భావ సిద్ధాంతాల గురించి మేధావులతో వాల్యూమ్స్ కొద్దీ పుస్తకాలు రాయించవచ్చని, కానీ సిద్ధాంతం అనేది క్షేత్రస్థా యిలో ని సామాన్య కార్యకర్తకు సైతం అర్థమ య్యేలా ఒకే ఒక్క సరళమైన వాక్యంలో ఉండాలని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. కులాల ఐక్యత గురించి ఉదాహరణగా చెప్తూ, బట్టలు కుట్టే టైలర్ శివనాగరాజు లాంటి సామాన్యుడికి ఉన్న అవగాహన మిగతా వారికి ఉందో లేదో తనకు తెలియదన్నారు. ఎందుకంటే బట్టలు కుట్టేటప్పుడు ఏ కులం వాడికి కుడుతున్నామా అని ఎవరూ ఆలోచించరని, అంత సింపుల్‌గా చూస్తేనే సమాజం బాగుంటుందని చెప్పారు. తాను కులాల ఐక్యత గురించి మాట్లాడుతుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం తానేదో కుల రాజకీయం చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. తానే గనుక ఒక్క కులం కోసమే పనిచేసే వ్యక్తినైతే, బాలినేని శ్రీనివాసరెడ్డి లాంటి సీనియర్ నాయకులు జనసేనలోకి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ఈ వ్యక్తి అందరి కోసం నిలబడతాడనే నమ్మకంతోనే వారు తన వద్దకు వచ్చారని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు వైఎస్సార్‌సీపీ నేతలతో ఎలాంటి శత్రుత్వం లేదా కోపాలు లేవని, కేవలం వారి విధివిధానాల మీదే తనకు విసుగు ఉంటుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తాము ఏదైనా పాలసీ (విధానాల) గురించి మాట్లాడుతున్నప్పుడు, ఎదుటివారు వ్యక్తిగత జీవితాలను హననం చేస్తూ పర్సనల్ ఎటాక్‌లు చేస్తున్నారని మండిపడ్డారు.

### హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులు

## ముందుకు సాగాలి




**హైదరాబాద్, జూన్ 27:** దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐటీసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### 'ఇది యువత భవిష్యత్తును

## దొంగిలించడమే'



**న్యూ ఢిల్లీ :**మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నాపత్రం లీక్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. దేశంలోని విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేశారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీక్? వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "మరోసారి ప్రశ్నపత్రం లీక్. మరో పరీక్ష రద్దు. ఈసారి, మహారాష్ట్ర ఎజు పరీక్ష. దేశంలోని విద్యా పరీక్షల వ్యవస్థ ఒక దోపిడీ వ్యవస్థగా మారిపోయింది. దీనివల్ల దేశంలోని యువత అంతా అభద్రతా భావంలో పడిపోయారు. ఇది కేవలం ప్రశ్నపత్రం లీక్ మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే.' 'ఇదిలా ఉండగా, థానే జిల్లాలోని భివాండీ పట్టణంలో టెట్? పేపర్? లీక్ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. టెట్? అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను పోలి ఉన్న కొన్ని పత్రాలు కొందరి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ విషయంపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పవన్ బన్సోద్ పర్యవేక్షణలో భివాండి పోలీసులు వ్యూహాత్మకం గా వ్యవహరించారు. తక్షణ చర్యలు చేపట్టి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, నగదు, టెట్ పరీక్షకు సంబంధించిన నాలుగు సెట్ల ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దిల్లీ నుంచి భివాండికి తీసుకువచ్చిన ప్రశ్నపత్రాల సెట్‌ను రూ.1.5 కోట్ల భారీ మొత్తానికి విక్రయించేందుకు ఒప్పందం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

### వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు, అవసరమైతే

## సుప్రీంకు వెళ్తాం




**హైదరాబాద్ :**వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని యథాతథంగా అంగీకరించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేరళం, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. జులై 2న నిర్ణయం : రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే ఈ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తలవంచేది లేదని, అవసరమైతే ప్రత్యేక రాష్ట్ర ఉపాధి హామీ పథకం తీసుకొస్తామని స్పష్టం చేశారు. జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. వీబీ-జీ రామ్‌జీ చట్టంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ప్రజాసంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమైంది. మంత్రి సీతక్క సమావేశానికి హాజరుకాగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న వీబీ-జీ రామ్ జీ చట్టం సమాఖ్య స్ఫూర్తిపై జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని మంత్రి ఆరోపించారు. కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ ఖరారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్లు ఉత్తమ్ వెల్లడించారు.

### సీషెల్స్ మా క్లోజ్ ఫ్రెండ్ విలువైన సముద్ర భాగస్వామి

**న్యూ ఢిల్లీ :**సీషెల్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీకి ఘనస్వాగతం లభించింది. సీషెల్స్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షుడు హెర్మినియా ప్రధానికి స్వాగతం పలికారు. అధికారిక గౌరవ వందనం కూడా స్వీకరించారు. 3రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినియాతో ద్వైపాక్షిక చర్చలు జరపట ంతోపాటు జాతీయ దినోత్సవాల్లో గౌరవ అతిథిగా పాల్గొంటారు. సముద్ర భద్రత, రక్షణ, ఆరోగ్యం, విద్య, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు దృష్టి సారించనున్నారు. ప్రధాని మోదీ సీషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగించడమే కాకుండా ప్రవాస భారతీయులతో ముచ్చటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన భారత్-సీషెల్స్ మధ్య 1976 నుంచి ఉన్న దశాబ్దాల నాటి స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సీషెల్స్ అధ్యక్ష పేర్కొంది.

### ముగ్గురు సీఎంలు

## సీక్రెట్ మీటింగ్



**హైదరాబాద్ :**
ఇటీవల కర్ణాటకలోని హోస్పేటలో జరిగిన తుంగభద్ర డ్యామ్ గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి ఒకే వేదికను పంచుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు భేటీ అయి చర్చించారు. అయితే దీనిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ముగ్గురు ముఖ్యమంత్రుల రహస్య భేటీ వివరాలను బయటపెట్టాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేశారు. ముగ్గురు సీఎంల భేటీ చారిత్రకం అని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆ వివరాలు తెలంగాణ ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు కర్ణాటక ప్రభుత్వంతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారనే అనుమానం కలుగుతోందని తేల్చి చెప్పారు. అయితే ముగ్గురు సీఎంల సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని బయట కూర్చొబెట్టారని.. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రిని కూడా బయట ఉంచేంత రహస్యం అందులో ఏముందని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన ఇంజనీర్లు, ఈఎన్సీని కూడా లోపలికి ఎందుకు రానివ్వలేదని నిలదీశారు. ఇంజనీర్లను, నీళ్ల మంత్రిని బతెలంగాణకు చెందిన ఇంజనీర్లు, యట ఉంచి ఆ ముగ్గురు గంటసేపు ఏం మాట్లాడుకున్నారు.. దాని వల్ల తెలం గాణకు ఏం ప్రయోజనం జరిగిందో అసెంబ్లీ వేదికగా బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

**అందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి): గోదావరి నదిలో వరదల నేపథ్యంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపటాలని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోవో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో గోదావరి నీరు చేరకుండా వర్షపు నీరు వేగంగా నదిలోకి వెళ్లేలా పంపింగ్ మోటార్లను సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు అందించాలన్నారు. గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని ఎరువులు ముఖ్యంగా యూరియా వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా జాతీయ రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు పుష్కరాల ఏర్పాట్లు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మంత్రి భద్రాచలం--కూనవరం రహదారిపై చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. మూడు సంవత్సరాలుగా పనులు పూర్తికాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సారపాక జాతీయ రహదారిపై ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో గోదావరి వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఎత్తును పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ప్రజల ప్రాణ ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రెవెన్యూ ఎస్డీఆర్ఎఫ్ ఎన్డీ ఆర్ఎఫ్ తదితర శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ వర దల వల్ల ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు తీసు కోవాలని సూచించారు. వరదలకు ముందు వరదల సమయంలో అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సన్నద్ధతతో ఉండాలని వర్షపాతం వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి వరదల సమయంలో బూర్గంపాడు అశ్వాపురం ప్రాంతాలు అధికంగా ప్రభావితమవుతాయని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల సన్నద్ధతలో పరిశ్రమల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఎ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, అటవీ, అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పొంగులేటి

ఖమ్మం జిల్లా, విశాలజ్యోతి: పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా.. వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి గారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళ చెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నిజయోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వలిగొండలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పర్యటన

**ప్రజా సమస్యలపై ఆరా, చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సాయం..**

యాదాద్రి భువనగిరి జిల్లా, విశాలజ్యోతి: భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ఈరోజు తన సొంత ఊరైన వలిగొండలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా పలువురు కుటుంబాలను పరామర్శించి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి ప్రాణమిత్రుడు



రామచంద్రు ముదిరాజ్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి, ఆ కుటుంబానికి రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, "సొంత ఊరి ప్రజలంటే నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం ప్రజా ప్రతినిధిగా నా బాధ్యత. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి నా వంతు సహాయం అందిస్తూనే ఉంటాను" అని తెలిపారు. ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సాయానికి రామచంద్రు ముదిరాజ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన సమయంలో వెంటనే చేయూతనివ్వడం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని స్థానికులు అభినందించారు.

# వరంగల్ కుషల్ మహోత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని




వరంగల్, విశాలజ్యోతి: వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ కుషల్ మహోత్సవ్ -- కుషల్ భారత్, వికసిత్ భారత్ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు , వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్ అని పేర్కొన్నారు. ఇప్పటికే వరంగల్ విద్యా కేంద్రంగా ఎదిగిందని, రానున్న రోజుల్లో హెల్త్ హబ్, స్పోర్ట్స్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. మామునూరు విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా వరంగల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. స్థానిక యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకునేలా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు అవసరమైన ప్రావీణ్యం, శిక్షణను అందించడంలో ఇలాంటి కుషల్ మహోత్సవ్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, మాజీ ఎంఎల్ సి కపిలవాయి దిలీప్,మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల చైర్మన్ ఓడితల సతీష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ లో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలి

**పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి**

తొర్రూరు, విశాలజ్యోతి: తొర్రూరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు మరియు పార్టీ శ్రేణులందరూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, పార్టీ శ్రేణులు సంబంధిత బిఎల్ వో లతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సవరణ, ధృవీకరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం మనందరి బాధ్యత అని పేర్కొంటూ, ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు పిలుపునిచ్చారు.




# నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది

**వరంగల్ డీసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్**

వరంగల్, విశాలజ్యోతి: వరంగల్ పట్టణం లోని టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారు ప్రారంభించిన "ఛాత్రోన్ కి గూంజ్" ఉద్యమానికి మద్దతుగ విద్యార్థులతో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ గారుఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, తరచూ జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలు లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి పరీక్ష లకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకేజీల కార ణంగా వారి శ్రమ వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. యువత గొంతుకే దేశ భవిష్యత్తు -ఛాత్రోన్ కి గూంజ్ విజయవంతం కావాలి అని అన్నారు.



# సింగరాజుపల్లిలో "హర్ ఘర్ జల్" కార్యక్రమం ప్రారంభం

జనగామ జిల్లా విశాలజ్యోతి: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో "హర్ ఘర్ జల్" కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మిషన్ భగీరథ ఏ ఈ శ్రీమతి మానస గారికి గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హర్ ఘర్ జల్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.




# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు

వరంగల్ జిల్లా విశాలజ్యోతి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో స్టానిక సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ గారితో కలిసి పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస నాయక్. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాటాడుతూ ఓటర్లకు అవసరమైన అవగాహన ఎసఐఆర్ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఎ లను భాగస్వామ్యం చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా చుడలాని గ్రామ అధ్యక్షులకు సూచించారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని,ప్రతి ఒక్క ఓటు తొలగించకుండా కాపాడుకునే భాధ్యత టిసుకోవలాని పార్టీ బి ఎల్ ఎ లను, సర్పంచ్లను, గ్రామ పార్టీ అధ్యక్షులను సినియర్ నాయకులాను, మండల, జిల్లా నాయకులను,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ,అనుబంధ సంఘుల అధ్యక్షులను, మాజీ ప్రజాప్రతినిధులను, క్రియాశీల కార్యకర్తలను కోరినారు.



# విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన

కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి: కుమురం రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ షీ టీమ్, ఆసిఫాబాద్ పట్టణం లోని జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రేరణాత్మక తరగతులు నిర్వహించి, ప్రాధాన్యతను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అలాగే సోషల్ మీడియా లో వ్యక్తిగత ఫోటోలు పోస్ట్ చేయవద్దని, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల దుష్ప్రభావాలను వివరించారు. సోషల్ మీడియా కారణంగా కలిగే మానసిక ఒత్తిడి, వల్ల చదువు సన్నగిల్లుతుందని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసిఫాబాద్ షీ టీం ఫోన్ నంబర్ 8712670564 కు సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇంచార్జ్ బిక్కలాల్, సిబ్బంది స్వప్న, వరలక్ష్మి ,దినేష్ తదితరులు పాల్గొన్నారు.



PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం,
జూన్ 28 2026


# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ హరిత**

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి**

జిల్లాలోనిపిల్లలభవిష్యత్తును పోలియో మహమ్మారి బారి నుండి రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జూన్ 28 (ఆదివారం) నాడు జిల్లావ్యాప్తంగా 'పల్స్ పోలియో' చుక్కల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన గోడ ప్రతులను పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నేనే స్వయంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. సీతారాం వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభిస్తున్నామని అన్నారు. జిల్లా ప్రజలకు, పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయునది 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. మన జిల్లాలో ఈ వయస్సు కలిగిన 46,516 మంది పిల్లలను గురించి, అందరికీ చుకతెలిపారు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపా రు.దీనికోసం జిల్లావ్యాప్తంగా 3,101 వ్యాక్సిన్ వైల్స్, 667 పోలియో బూత్‌లు, 14 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ బృందాలు, మరియు 86 రూట్ సూపర్‌వైజర్లను అందుబాటులో ఉంచాము. అన్ని పి హెచ్ సి లు, పి పి.యూనిట్లు, గ్రామాలు మరియు బూత్‌లలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఈ బృహత్తర కార్యం కోసం



మొత్తం 2,668 మంది వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పనిచేస్తున్నారు. పోలియో చుక్కల కార్యక్రమం ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. ఇటుక బట్టీల్లో పని చేసే కుటుంబాలు, వలస కార్మికులు, సంచార జాతులు, నిర్మాణ కార్మికులు, మత్స్యకారులు, పట్టణ శివారు ప్రాంతాలు, కొత్త కాలనీలు మరియు వ్యవసాయ క్షేత్రాల్లో నివసించే హైరిస్క్ వర్గాల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చుక్కల మందు వేయాలని ఇప్పటికే ఆరోగ్య సిబ్బందిని ఆదేశించడమైనది. ఈరోజు సాధారణ ఇమ్యునైజేషన్‌లో భాగంగా పోలియో వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ, రేపు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో మళ్లీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలి. పోలియో రహిత సమాజ స్థాపన కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ 5 సంవత్సరాల లోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కుజి తీసుకువచ్చి, తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు సోమ మంగళవారాలలో సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు పంపిణీ చేస్తారని అన్నారు

# జాతీయ అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి

**నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చిన ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కే లక్ష్మణ్**

**వరంగల్, విశాలజ్యోతి:**

ఈనెల 29న వరంగల్ జిల్లాలో బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళన కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ గారు రానున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారి అధ్యక్షతన సత్యం కన్వెన్షన్ హాల్ హంటర్ రోడ్ లో ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కే లక్ష్మణ్ గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కే లక్ష్మణ్ గారు మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుల రాకను పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనను ఒక చారిత్రాత్మక విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, జాతీయ కౌన్సిల్



మెంబర్ గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్తనేని ధర్మారావు, గువ్వల బాల రాజు, వరంగల్ జిల్లా ప్రభరి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, వన్నాల శ్రీరాములు, టి రాజేశ్వరరావు, కొండేటి శ్రీధర్, రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధం నరేష్, దాస్యం అభినవ్ భాస్కర్, సర్వోత్తమ్ రెడ్డి, మాజీ జిల్లా వంగాల సమ్మిరెడ్డి, మంద ఐలయ్య, దొంతి దేవేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర మహిళ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి మరియు రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మూర్ఛ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సమరభేరి సభకు ప్రముఖులకు ఆహ్వానం

**ఆహ్వానించిన పటేల్ వనజ బృందం**

**హైదరాబాద్, విశాలజ్యోతి:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమర భేరి" భారీ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ ఆధ్వర్యంలోని బృందం పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసింది. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పి.ఓ.డబ్ల్యూ. అధ్యక్షురాలు సంధ్య, నవ తెలంగాణ ఎడిటర్ రాంపల్లి రమేష్, టీ10 న్యూస్ ఛానల్ సీఈఓ సుందర్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాబ్ బాబులను మర్యాదపూర్వకంగా కలిసి సభ ఆహ్వాన పత్రికలను అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సమరభేరి సభకు అన్ని వర్గాల ప్రజలు,



ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పటేల్ వనజ కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బత్తిని మీనా గౌడ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వీరమల్లు అనిల్,రాష్ట్ర సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

# వేస్టేజ్ ఉత్పత్తులతో సులభంగా వ్యవసాయం



**విశాలజ్యోతి (దంతాలపల్లి):** దంతాలపల్లి మండల పరిధిలోని రేపోణి గ్రామంలో వేస్టేజ్ హోమ్ మీటింగ్ నిర్వహిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నా వేస్టేజ్ డైమండ్ డైరెక్టర్ రమేష్ రమ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూమి సారాన్ని పెంచి అధిక దిగుబడి ఇస్తుందని వేస్టేజ్ కంపెనీ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తుందని అన్నారు. పర్యావరణానికి సురక్షితంగా ఉంటూ పంటల నాణ్యతను పెంచడంలో సహాయపడుతుందన్నారు.

**వెస్టేజ్ అగ్రి ఉత్పత్తుల వాటి ప్రయోజనాలు :**

అగ్రి 82 ఇది 82% చురుకైన పదార్థాలతో కోనాన్ -ఆయానిక్ స్ప్రే ఇది పురుగు మందులు మరియు ఎరువులు మొక్కలపై సమానంగా వ్యాపించేలా చేస్తుంది అదనంగా భూమిలో తేమ నింపుకోవడానికి మరియు నీటి శోషణను మెరుగుపరచడానికి సహాయపడుతుందన్నారు.

**అగ్రీ హ్యూమిక్ :** ఇది మొక్కలు పెరుగుదలను ప్రోత్సహించే సహజ సిద్ధమైన బయో స్టిమ్యులెట్ భూమిలోని సూక్ష్మజీవుల చర్యలను వేగవంతం చేసి మొక్కల వేరు వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు

**అగ్రి గోల్డ్ :** మొక్కలలో పోషకాలను మెరుగుపరుస్తుంది వాతావరణంలో వచ్చే మార్పులను మరియు ఒత్తిడి నుండి పంటను రక్షించి రైతులకు అందిస్తుంది

**అగ్రి ప్రోటెక్ :** మొక్కలకు సోకే వివిధ రకాల తెగుళ్లను మరియు సిలింద్రాల నుండి పంటలను కాపాడడానికి తోడ్పడుతుంది అన్నారు. పంటలకు రోగ నిరోధక శక్తి పెంచుతుంది.

**అగ్రీ మాస్ :** ఈ ప్రోడక్ట్ మొక్కలు పుత మరియు పిందే దశలో ఉన్న పంటలకు అద్భుతమైన పోషణను అందిస్తుంది. మొక్కలకు పూసిన పూత రాలిపోకుండా కాపాడే అధిక దిగుబడి రైతులకు అందిస్తుంది అన్నారు. ఇలాంటి ప్రోడక్ట్లు రైతులు వారి అధిక లాభాలు పొందాలని సూచించారు ఈ కార్యక్రమంలో వేస్టేజ్ డైమండ్ డైరెక్టర్ రమేష్ రమ గంగా అశ్విని సుమతి గౌతమి రష్మిక గ్రామ ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు

# రూ.40 లక్షలతో పాఠశాల అదనపు తరగతి గదులు

**ప్రయాణించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు.**

**పెద్దపల్లి జిల్లా, విశాలజ్యోతి:**

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం చీమలపేట గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రాథమిక ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభం మరియు రూ. 10 లక్షలతో అంతర్గత సి.సి రహదారుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు 10,01,160 /- లక్షల రూపాయల విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణి చేసిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు గారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ తన సోదరులు స్వర్గీయ చింతకుంట సుధాకర్ రావు గారి జ్ఞాపకార్థంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులకు, చీమలపేట గ్రామ ఉపసర్పంచ్ మధుకర్ గారికి మరియు టీం సభ్యులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన మరియు రన్నరప్ గా నిలిచిన జట్లకు బహువతులు ప్రధానం చేయడం జరిగింది అని చీమలపేట గ్రామానికి తన అన్న సుధాకర్ రావు గారు సుపరిచితుడు ఈ గ్రామంలో ప్రతి ఇల్లు తన అన్నకు తెలిసినవాళ్లే అని అతని మరణ అనంతరం తాను రాజకీయల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా బాధ్యత నిర్వహిస్తున్న తరుణంలో జూలపల్లి, ఎలిగేడు జడ్పీటీసీ





ఎన్నికల్లో పోటీ చేయడంతో చీమలపేట గ్రామా ప్రజలు తన అన్న సుధాకర్ రావు గారిపై ఉన్న ప్రేమతో మరియు నాపై నమ్మకంతో నాకు ఓట్లు వేసి గెలిపించారు. ఆనాడు చీమలపేట గ్రామంలో త్రాగు నీరు సమస్య ఉండటంతో బోరు వేసి త్రాగునీటి సమస్య లేకుండా చేయడం జరిగిందని 1997-98 సంవత్సరంలో జన్మభూమి కార్యక్రమంలో పాఠశాల నూతన గదులను నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామస్తుల ఆలోచన ప్రకారం ఈరోజు 40 లక్షల రూపాయల నిధులతో రెండు అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.తాను శాసనసభ్యుడిగా గెలుపొందిన రెండున్నర సంవత్సరాల్లో చీమలపేట గ్రామంలో దాదాపు కోటి రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు చేయడం జరిగిందని మరియు రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి త్వరలో రోడ్డు పనులు పూర్తి చేస్తాం వాటితో పాటు అంగన్వాడీ భవన రిపేర్ కోసం 2 లక్షలు మరియు గ్రామపంచాయతీ రిపేర్ కోసం 5 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చెర్మన్ కొమ్మ పోచాలు పలు గ్రామాల సర్పంచ్ లు,లంక స్వామి ఉపసర్పంచ్ తొంటి మధుకర్ మరియు అధికారులు, తహశీల్దార్ దత్తు ప్రసాద్ ఎంపీవో,వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు,లోక జలపతి రెడ్డి, బొజ్జ శ్రీనివాస్,పుల్లరి వేణుగోపాల్ రావు,దరబోను నర్సింగ్ యాదవ్,మెతుకు కాంత్తయ్య,శ్రీకొండ కొంరయ్య,కందుకేరు అంజయ్య,బండీ స్వామి,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నార

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయవంతం చేయాలి



**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):**

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు.శనివారం కార్యాలయంలో ఆయన జిల్లా వైద్యాధికారులు సిబ్బందితో నిర్వహిం చిన జూమ్ సమీక్ష సమావేశంలో పల్స్ పోలి యో కార్యక్రమంపై కీలక సూచనలు చేశారు. ఈనెల 28 నుండి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. జిల్లాలో 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 98 818 మంది 0-5 సంవత్సరంలోపు పిల్లలకు పోలి యో చుక్కలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం925 బూత్‌లు 38 ట్రాన్సిట్ పాయిం ట్లు, 1001 టీములు ఏర్పాటు చేయడం జరి గిందని తెలిపారు. పల్స్ పోలియో కార్య క్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడం అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి వైద్యాధికారి ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని తుకారాం రాథోడ్ పిలుపు నిచ్చారు. అనంతరం పల్స్ పోలియో బ్యానర్ను కూడా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, ప్రతాప్ డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సిహెచ్ఓ నాగభూషణం, హెచ్ ఇవో రాంప్రసాద్, రామా రావు,హరి కృష్ణ,నర్సింగ్ ఆఫీసర్ప్రియాతదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుంది

**యోగ శిక్షకులు మిద్దె అజయ్**

**కామారెడ్డి జిల్లా, విశాలజ్యోతి:**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు ఆదేశాలతో అధ్యాపకులు విద్యార్థులకు యోగ శిక్షణ, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, యోగా శిక్షకుడు అజయ్ కుమార్ రెండు గంటల పాటు యోగా ఆసనాలు వేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే యోగా వలన కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు యోగా కోసం సమయం కేటాయించాలి అని సూచించారు. యోగా వలన ఆరోగ్యం తో పాటు మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు. వీరేశం, సతీష్ లు మాట్లాడుతు యోగా ప్రాధాన్యత గురించి తెలియచేశారు. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్య తో పాటు





అన్ని రంగాలలో తీర్చి దిద్దెందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లేశం, శ్రీకాంత్, అలంపల్లి శ్రీనివాస్, సర స్వతి, మనీషా, హారిక సిబ్బంది నరసయ్య, సోటేరియా పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

**విశాఖజ్యోతి (దంతాలపల్లి)**

దంతాలపల్లి మండల కేంద్రంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు తాహ సిల్దార్ కార్యాలయం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనంతరం రైతు వేదికలో జరుగుతున్న విత్తన మేళ కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పిల్లలతో ఇంగ్లీష్ లో మాట్లాడుతూ వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారుకచ్చితంగా ప్రతి ప్రభుత్వ పాంశాలలో ఇంగ్లీషులోనే విద్యను బోధించాలన్నారు.పిల్లలతో ఇంగ్లీషులోనే సంభాషించాలని సూచించారు.అన్ని సబ్జెక్టుల తో పాటు ఇంగ్లీష్ లో కూడా ప్రావీణ్యం పొందే విధంగా విద్యా బోధనలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తద్వారా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు,ప్రభుత్వం విద్యా వ్యవస్థలు బలోపేతం చేయడం కోసం అనేక నిధులు కేటాయించి నాణ్యమైన పక్కా డైట్ మెనూ అమలు చేయడం జరుగుతుందన్నారు.వసతి గృహాలు పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలన్నారు.బడిబాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే



ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న విత్తన మేళ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎరువులను అందించడం జరుగుతుందని చెప్పారు. వాటి ద్వారా రైతులు మేలిమి పంటలను దిగుబడి చేసుకోవచ్చని సూచించారు.రైతులు పంట మార్పిడి విధానం ద్వారా ముందుకు పోవాలని సేంద్రియ ఎరువులను ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని రైతుల కు సూచించారు.నానో యూరియా వాడాలని నానో యూరియాను ప్రమోట్ చేయాలని క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక రికార్డులను పరిసరాలను పరిశీ లించారు. మండల పరిధిలో సాదా బైనామా భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు స్థానిక తహసిల్దార్ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 13 ఏళ్ల బాలుడిగా వెళ్లి 24 ఏళ్ల యువకుడిగా తిరిగొచ్చిన హనుమంతు

**ఊట్కూర్ :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కురువ భీమప్ప--ఎల్లమ్మ దంపతుల చిన్న కుమారుడు హనుమంతు (అలియాస్ తికిలప్ప) 11 ఏళ్ల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. 13 ఏళ్ల వయసులో వలస సమయంలో తప్పిపోయిన హనుమంతు, 24 ఏళ్ల యువకుడిగా తిరిగి ఇంటి గడప తొక్కడంతో తల్లిదండ్రుల 11 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. భీమప్ప, ఎల్లమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, అందరిలో చిన్నవాడైన హనుమంతు 13 ఏళ్ల వయసులో గొర్రెలను మేపేందుకు తండ్రితో కలిసి వలస వెళ్లాడు.ఆ సమయంలో అను కోకుండా తప్పిపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుమా రుడు ఎప్పటికైనా తిరిగి వస్తాడనే ఆశతో ఏళ్ల తరబడి ఎదురుచూశారు.ఇటీవల చెన్నైలోని 'మనసు' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హనుమంతు వివరాలను గుర్తించారు. గూగుల్ సహాయంతో తిప్రాస్‌పల్లి గ్రామాన్ని గుర్తించి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్



భర్త నరసింహ వెంటనే చెన్నై వెళ్లి అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసి హనుమంతును క్షేమంగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. 11 ఏళ్ల తర్వాత కుమారుడిని కళ్లారా చూసిన భీమప్ప, ఎల్లమ్మ దంపతులు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. 13 ఏళ్ల బాలుడిగా తప్పిపోయిన కుమారుడు 24 ఏళ్ల వయసులో ఇంటికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హనుమంతు ఆచూకీ కనుగొని స్వగ్రామానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించిన 'మనసు' స్వచ్ఛంద సంస్థ, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, ఆమె భర్త నరసింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భూకబ్జా నుంచి కాపాడి ఎస్సీ రైతులకు న్యాయం చేయాలి

**నార్నూర్ :** భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారతీయ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కుట్ల శంకర్, జిల్లా కార్యదర్శి చిలుకా దేవిదాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో వారు మాట్లాడారు. మహాగావ్ శివారులో 70 ఏళ్లుగా ఎస్సీ రైతులు భూమిని సాగు చేసుకుంటున్నారని వివరించారు. అదే గ్రామానికి చెందిన రాథోడ్ హరిచంద్ ఎస్సీల భూమిని దున్ని పంట సాగు చేస్తున్నట్లు మండిపడ్డారు.రాథోడ్ హరిచంద్ పై రైతులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆదేశాలను బేఖాతర్ చేసి పంట సాగు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఎస్సీ రైతులకు న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు దుర్గే గుణవంత్ రావ్, యశోద బాయి, దుర్గే లీలాబాయి, దుర్గే పురుషోత్తం, జాడే నాగోరావ్, రమాకాంత్, సమతా సైనిక్ దళ్ సభ్యులు ఉన్నారు.



# ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతి

**మల్లాపూర్, జూన్ 27 :** ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి లయన్స్ క్లబ్ ద్వారా తమ వంతు కృషి చేస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి అన్నారు. మలాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో లయన క్లబ్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లను ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, తద్వారా ఎన్నో రకాల రోగాల బారిన పడుతున్నప్పటికి ప్రజల్లో మార్పు రావడం లేదన్నారు.ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగహన సదస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడ సర్పంచ్ తోట శ్రీనివాస్, కౌశాధికారి మిల్క నవీన్ రెడ్డి,



కార్యదర్శులు శశికాంత్ రెడ్డి, మంద స్వామి, సభ్యులు గందాల శివప్రసాద్, లక్ష్మణ్, తోట లక్ష్మారెడ్డి, ఎదులాపురం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వారం రోజులపాటు

## భారీ వర్షాలు వాతావరణ కేంద్రం శుభవార్త

**తెలంగాణ:** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది.వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం



ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది.

# ఓటరు జాబితా సవరణ

## పారదర్శకంగా చేపట్టాలి'



**బూర్గంపహాడ్, జూన్ 27 :** ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ప్రజలకు ఈ సర్వే ప్రక్రియ అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక సుందరయ్య నగర్‌లో జరిగిన సర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్లకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలు తమ ఓటరు వివరాలు పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్, బీఎల్వోలు, నాయకులు భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, వారాల వేణు, పూలపెల్లి సుధాకర్రెడ్డి, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


# భూ వివాదంలో సీఐ శ్రీధర్ రావుపై చర్యలు

## ఏఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఆదేశాలు

**వరంగల్:** భూ వివాదంలో బాధితుడిని ఇబ్బంది పెట్టారనే ఆరోపణలతో ధర్మసాగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీధర్ రావుపై వేటు పడింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావును ఏఆర్‌కు అటాచ్ చేస్తూ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భూ వివాదంలో బాధితుడి నుంచి డబ్బులు తీసుకొని, ఎదుటి వారికి సహకరించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ధర్మసాగర్ సీఐ పై నమస్తే తెలంగాణలో ఇటీవల " సెటిల్మెంట్ ఖాకీ' "భూ కబ్జా దారుడికి ధర్మ సాగర్ సీఐ వత్తాసు".. "మంత్రి తుమ్మలతో సీఐ పైరవీ" అంటూ వరుస కథనాలు ప్రచురించింది.వీటి పై వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్పందించారు. సీఐ శ్రీధర్ రావుపై సిపి విచారణకు ఆదేశించారు. కాగా ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సి ఉంది. విచారణ పూర్తై, నివేదిక వచ్చే వరకు సీఐ శ్రీధర్ రావును ఏఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

# పన్నూరులో విషాదం కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

**రామగిరి, జూన్ 27 :** రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ఫ్లాట్స్‌లో విషాదం చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న మొగిలి సాయి (26) శనివారం సాయంత్రం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే సాయి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం.
స్థానికుల కథనం ప్రకారం.. ఏడు సంవత్సరాల క్రితం గోదావరిఖనికి చెందిన యువతిని మొగిలి సాయి ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. గొడవలతో విసిగిపోయిన సాయి శనివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# చుంచుపల్లిలో ఘనంగా

## హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు



**చుంచుపల్లి, జూన్ 27 :** చుంచుపల్లి మండలంలోని ఐకేపీ కార్యాలయంలో సెర్ప్ దివ్యాంగుల సమ్మిళిత అభివృద్ధి ఆధ్వర్యంలో శనివారం హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఓ పీడీ విద్యాచందన మాట్లాడుతూ.. హెలెన్ కెల్లర్ వైకల్యాన్ని జయించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచిన మహనీయురాలన్నారు. దివ్యాంగుల హక్కులు, మహిళల సాధికారత కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె జీవితంలో ఉపాధ్యాయురాలు యాన్ సుల్లివన్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్ జీవిత విశేషాలు, ఆమె సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నీలేష్, డీపీఎం సురేష్ రెడ్డి, ఏపీఎంలు ఎస్.డి.అహ్మదుల్లా, రాంబాబు, బి.రామకృష్ణ, జిల్లాలోని వివిధ మండలాల అధికారులు, దివ్యాంగులు, ఓబీఎస్‌లు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ సమ్మెకైనా వెనుకాడదు సీతారామయ్య

**గోదావరిఖని :** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ సమ్మెకైనా వెనుకాడదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జీడీకే–11వ ఇంక్లైన్ లో శనివారం జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. సింగరేణి లో కార్మికుల సమస్యల పరిష్కారం లో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించేందుకు ఏఐటీయూసీ ముందుంటుందన్నారు. సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం గా యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో ఒప్పుకున్న వాటిని యాజమాన్యం అమలు చేయనందుకు నిరసిస్తూ 31 డిమాండ్ ల పై సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.దీనిపై ఈ నెల 25న హైదరాబాద్ లో ఆర్ఎల్‌సీ వద్ద చర్చలు జరిగాయని, జూలై 10 లోపు పరిష్కారం చేసుకోవాలని ఏఎల్‌సీ యాజమాన్యానికి సూచించించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం సమ్మె నోటీసులోని



డిమాండ్ ల పై పరిష్కారం చేయాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వీరభద్రం, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు సిద్దమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదును పరిశీలించిన కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**ఊట్కూరు, జూన్ 27:** నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలోని 31 పీఎస్ పరిధిలో చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదు ప్రక్రియను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరుజాబితాచేపట్టాలని ఆదేశించారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.

# ఏపీ ఎయిర్‌పోర్టుల్లో బార్ లైసెన్స్‌లకు ఎక్సైజ్ శాఖ గ్రీన్‌సిగ్నల్




**అమరావతి, జూన్ 27:** ఆంధ్రప్రదేశ్‌లోని ఎయిర్‌పోర్టుల్లో బార్ లైసెన్స్‌లకు ఎక్సైజ్ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి ఎయిర్‌పోర్టు మినహా అన్ని ఎయిర్‌పోర్టులకు బార్ లైసెన్స్‌లు వర్తించనున్నాయి. అయితే, ఎయిర్‌పోర్టు ఆపరేటర్ సిఫారసు ఉంటేనే బార్ లైసెన్స్ మంజూరు అవుతుంది. బార్ లైసెన్స్ దరఖాస్తుకు 5 లక్షల రూపాయల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రయాణికుల రద్దీ 20 లక్షలకు పైగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ 25 లక్షలు రూపాయలు ఉండనుంది.ప్రయాణికుల రద్దీ 20 లక్షలలోపు ఉన్న ఎయిర్‌పోర్టులకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ 15 లక్షలు రూపాయలు ఉంటుంది. ఆ ట్యాక్స్‌ను ఒకేసారి లేదా 6 సమాన వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉండనుంది. ఎయిర్‌పోర్టు బార్లను 24 గంటల పాటు నిర్వహించుకునేందుకు అనుమతి ఉంటుంది. భద్రత, ఎయిర్‌పోర్టు ఆపరేషనల్ నిబంధనలకు లోబడి సేవలు ఉండనున్నాయి. బార్ లైసెన్స్ నిబంధనల్లో సవరణలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# రొట్టెల పండుగకు వచ్చి సముద్రంలో గల్లంతైన అన్నాచెల్లెళ్లు



**నెల్లూరు, జూన్ 27:** జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలం కొత్తకోడూరు బీచ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. సరదాగా కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌కు వెళ్లిన ఇద్దరు చిన్నారులు సముద్రంలో గల్లంతవడంతో తీవ్ర విషాదం నెలకొంది. గల్లంతైన వారిని 11ఏళ్ల మహమ్మద్ సోఫియాన్, 17 ఏళ్ల రుక్సానాగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం కందుకూరుకు చెందిన మహమ్మద్ రఫి కుటుంబం నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు హాజరయ్యేందుకు వచ్చింది. పండుగ కార్యక్రమాల అనంతరం కుటుంబ సభ్యులంతా సరదాగా గడిపేందుకు బీచ్‌కు వెళ్లారు.ఈ సందర్భంగా మహమ్మద్ సోఫియాన్, రుక్సానా సముద్రంలోకి వెళ్లగా ఒక్కసారిగా అలల ఉద్ధృతి పెరగడంతో ఇద్దరూ గల్లంతయ్యారు. కుటుంబ సభ్యులు వారిని రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కళ్లముందే పిల్లలు సముద్రంలో కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. గల్లంతైన ఇద్దరి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అమరావతిలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోంది మంత్రి నాదెండ్ల



**అమరావతి, జూన్ 27:** అమరావతిలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇటీవల తమ పర్యటనలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని బట్టి ఆ పార్టీ నాయకుడు జగన్ రెడ్డికి అమరావతిపై ఎంత కక్ష ఉందో అర్థమవుతోందని తెలుస్తోందన్నారు. రైతులపై దండయాత్రలా వెళ్లి రాళ్ల దాడికి దిగడాన్ని రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదని, జగన్ రెడ్డి పాలన ఈ ప్రాంతంలో విధ్వంసంతో ప్రారంభమైందని విమర్శించారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. 'రాష్ట్రానికి మూడు రాజధానులు అం టూ భూములు త్యాగం చేసిన రైతులను రోడ్డు మీదకు తెచ్చిందీ వైసీపీ ప్రభుత్వం. అమరా వతి ప్రాంతంలో రైతులు నిరసనలు తెలుపు తుంటే అప్రజాస్వామికంగా వ్యవహరించింది. మహిళా రైతులను తీవ్రంగా అవమానించారు. జగన్ మెప్పు కోసం కొందరు నాయకులు ఈ ప్రాంతాన్ని శ్మశానంతో పోల్చారు. మూడు రాజధానుల విధానాన్ని రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తిరస్కరించారు. ఇప్పుడు జగన్ 'మావిగన్' అనే విచిత్రమైన రాజధాని గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమరావతిలో చిన్నపాటి నిర్మాణం కూడా జరగలేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రానికి బలమైన రాజధానిగా అమరావతి ఉండాలనే ఉద్దేశంతో పనులను వేగవంతం చేశారు' అని అన్నారు.

# ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకల దాడే హోం మంత్రి అనిత



**అమరావతి, జూన్ 27:** వైసీపీ నేతలను రాజధాని రైతులు అడ్డుకోవడంపై హోం మంత్రి అనిత స్పందించారు. వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదన్నారు. రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రాజధానిలో రౌడీయిజం చేయటానికి వెళ్లారా అని ప్రశ్నించారు. 'మీరు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పారు. మీరు వెళ్లిన పెనుమాకలో 90% రైతులు రాజధానికి భూములు ఇచ్చినవారే. రైతులపై రౌడీయిజం చేయడానికి గూండాలని వెంటబెట్టుకుని వెళ్లారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులే తప్పు చేసినట్టు ఇప్పుడు వైసీపీ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ నేతల వెంట వెళ్లినవారిలో ఎంతమంది రౌడీషీటర్‌లు ఉన్నారో డిపార్ట్మెంట్ దగ్గర మొత్తం సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామన్నారు. అమరావతి ప్రజల కలల రాజధాని ఈరోజు శరవేగంగా ముందుకు వెళుతోందని అన్నారు. 2027 నాటికి అమరావతి పూర్తి కావాలని అందరం అహర్నిశలూ కష్టపడుతున్నామని హోం మంత్రి వెల్లడించారు. ఆనాడు అమరావతి రాజధాని అని ఒప్పుకొని తర్వాత మూడు రాజధానుల డ్రామాలాడారని విమర్శించారు. మరలా ఇప్పుడు మావిగాన్ అంటూ ఏ ముఖం పెట్టుకొని రాజధానిలో పర్యటిస్తారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే తమకి మనుగడ కూడా ఉండదని వైసిపి ఈ డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడే అని అన్నారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు. అమరావతి రైతులు కడుపు మంటతో ఉన్నారన్నారు.అమరావతి రైతులకు అండగా ఉన్నందుకు గతంలో చంద్రబాబుపై భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ దాడులు చేశారని.. కానీ మేము అలాంటి వాటిని ప్రోత్సహించడం లేదని అనిత అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందని.. విచారణ కూడా చేస్తామన్నారు. వైసీపీ నేతలను అడ్డుకుంది అమరావతి రైతులేనని.. టీడీపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. ఆనాడు టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన రౌడీలు, గూండాలు నేడు రాజధాని రైతులపై దాడికి వచ్చారన్నారు. వారందరి విజువల్స్ కూడా ఉన్నాయని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# 'రాజధాని ద్రోహి జగన్, గో బ్యాక్' అంటూ అమరావతి రైతుల నినాదాలు




**అమరావతి, జూన్ 27 :** అమరావతి ప్రాంతంలో వైసీపీ నేతల పర్యటన ఉద్రిక్తతకు దారి తీసింది. ఈరోజు(శనివారం) పెనుమాక సందర్శనకు వచ్చిన వైసీపీ నేతల బృందాన్ని ఉండవల్లి వద్ద రాజధాని రైతులు అడ్డుకున్నారు. వాహనాలు ముందుకు వెళ్లకుండా రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'రాజధాని ద్రోహి జగన్, గో బ్యాక్' అంటూ రైతులు నినాదాలు చేశారు. వైసీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని రాజ ధానికి వస్తారని ప్రశ్నించారు. మావిగన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి వైసీపీ నేతల పర్యటనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.అమరావతిని రాజధానిగా అంగీకరించిన తర్వాతే పర్యటించాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. రైతులను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజధాని రైతులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడగా, ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు

**వైసీపీ శ్రేణులే కోడిగుడ్లతో దాడి చేశాయి:** రాజధాని రైతులుఈ సందర్భంగా రాజధాని రైతులు మాట్లాడారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై వైసీపీ శ్రేణులే కోడిగుడ్లతో దాడి చేశాయని ఆరోపించారు. అలాగే వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్‌తో పాటు పెనుమాక, కృష్ణాయపాలెం ప్రాంతాల్లో కూడా రైతులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. అమరావతి రాజధాని అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని రైతన్నలు స్పష్టం చేశారు.మరోవైపు, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉన్నప్పటికీ, అమరావతి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# అవును పెనుకొండ మా జాగీరే





**పెనుకొండ(అనంతపురం):** 'అభివృద్ధి, సంక్షేమం విషయంలో పెనుకొండ మా జాగీరే. మా తాత, మా నాన్న, నేను పుట్టింది ఇక్కడే. ఇది నా జాగీరే' అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ తనపై లేనిపోని ఆరోపణలు చేశారని, 'పెనుకొండ నీ అబ్బ జాగీరా' అని బహిరంగ సభలో ప్రశ్నించారని అన్నారు. ఉష శ్రీచరణ్ వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు. పెనుకొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వమని అన్నారు. అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక పోతున్నారని అన్నారు.పెనుకొండకు సేవచేసే భాగ్యాన్ని సీఎం చంద్రబాబు తనకు ఇచ్చారని, అభివృద్ధిలో తన తండ్రిబాటలో దూసుకుపోతున్నానని అన్నారు. కాబట్టి పెనుకొండ తన జాగీరేనని అన్నారు. నియోజకవర్గంలోని సీఎం సహాయనిధి లబ్ధిదారులకు ఆమె చెక్కులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గంలో 1306 మందికి రూ.13.45 కోట్లు సీఎం సహాయనిధి చెక్కులు ఇచ్చానని తెలిపారు. తాజాగా 121 మందికి రూ.1.15 కోట్లు మంజూరుకావడంతో లబ్ధిదారులకు చెక్కులు ఇచ్చానని వెల్లడించారు.

# అమరావతిలో ఉద్రిక్తత వైసీపీ నాయకులను అడ్డుకున్న రైతులు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి లో ఉద్రిక్తపరిస్థితులు నెలకొ న్నాయి. వైసీపీ నాయకులు శనివారం అమరా వతిలో పర్యటన ఖరారు చేసుకున్నారు. విష యం తెలుసుకున్న ఉండవల్లి రైతులు వైసీపీ నాయకులను అడ్డుకున్నారు. రాజధాని అమరావతిని గుర్తించని వైసీపీ నాయకులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.మూడు రాజధానుల పేరిట ముప్పుతిప్పలు పెట్టిన వైసీపీకి అమరావతిలో పర్యటించే అర్హత లేదంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలతో రైతులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఒకరినొకరు తోసుకోవడంతో ఘర్షణ ఏర్పడింది. రాళ్లు రువ్వుకోవడంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. రాజధానిగా అమరావతిని గుర్తించాకే పర్యటించాలని డిమాండ్ చేశారు. తుళ్లూరు డీఎస్పీ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పెనుమాక, కృష్ణయపాలం రైతులు సైతం వైసీపీకి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ సర్వదర్శనానికి 18 గంటల సమయం



**అమరావతి :** తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండి ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. శుక్రవారం 81,340 మంది భక్తులు దర్శించుకోగా 44,874 మంది తలనీలాలు సమర్పించారు.

భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ.3.76 కోట్లు ఆదాయం వచ్చింద న్నారు. 4.42 లక్షల లడ్డూను విక్రయించా మని,3 .31 లక్షల మంది అన్నప్రసాదం స్వీక రించారని తెలిపారు.

### ఏపీలో 85 వేల మంది అక్కాచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం వైఎస్ జగన్



గవర్నమెంట్ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కాచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు వీరిలో చాలా మంది ఉన్నారని, ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీవారి పొట్టలు నింపుతూ అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు.గతంలో మధ్యాహ్న భోజ నం కార్మికులకు రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు..మని హామీ ఇచ్చారు.